చినుకు పడితే.. కునుకు కరువే

- సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్లలోకి చేరుతున్న వరదనీరు
- ఏటా పల్లెవాసులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



అందె సత్తమ్మ ఇంట్లోకి చేరిన వరద నీరు (ఫైల్)

మంథనిరూరల్: గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల ప్రజలు తిప్పలు పడుతున్నారు. వర్షపు నీరు లోతట్టు ఇళ్లను ముంచెత్తుతోంది. ఏటా వర్షం నీళ్లు ఇళ్లలోకి రావడంతో గ్రామస్తులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంథని మండలం లోని పలు గ్రామాల్లో చినుకుపడితే చాలు మురికి కాల్వలు పొంగి ఇళ్లలోకి మురుగునీరు చేరుతోంది. దీంతో బాధిత కుటుంబాలు నానా ఇబ్బందులకు గురవుతున్నాయి.

అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి..

మంథని మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. కొన్ని గ్రామాల్లో ఉన్నా వాటి నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. డ్రైనేజీలు చెత్తా చెదారంతో నిండి, పిచ్చిమొక్కలు పెరగడంతో నీళ్లు వెళ్లకపోవడగంతో వర్షపు నీరు నిండి పొంగుతున్నాయి. పక్కనే ఉండే ఇళ్లలోకి కాలువల నీళ్లు చేరుతున్నాయి. అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏటా గోస పడుతున్న



ఏటా వానాకాలంలో వానలు బాగా పడితే మురికి కాల్వల నీళ్లన్నీ మా ఇంటిలోకే వస్తయి. ఏటా ఇట్లనే గోసపడుతన్న. రాత్రి సమయంలో బాగా వాన పడితే ఆరోజు ఇంటి నిండా నీళ్లు నిలిచి కంటిమీద కునుకు ఉండదు. గిట్ల గోసపతున్నా కూడా అధికారులు పట్టించుకుంటలేరు.

– అందె సత్తమ్మ, గుంజపడుగు

చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లోని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలె. పూడిక తీయకపోవడంతో చిన్న వర్షం పడితే ఇళ్లలోకి నీళ్లు వస్తన్నయ్. అధికారులు ఈ సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– జన్నె ఓదమ్మ, గుంజపడుగు

కొత్త డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదన

గుంజపడుగులో మురికికాల్వలు పాతవి కావడంతో కొంత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భారీవర్షం పడితే ఇళ్లలోకి నీళ్లు వచ్చే వారిని కలిశాం. మళ్లీ నీళ్లు వచ్చి ఇబ్బంది ఏర్పడితే తాత్కాలిక పునరావాసం ఏర్పాటు చేస్తామని చెప్పాం. ఈ సమస్యపై ఎంపీడీవో, డీఎల్‌పీవో ఆదేశాల మేరకు నూతన డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నం.

– భానుప్రసాద్, పంచాయతీ సెక్రటరీ, గుంజపడుగు



రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనున్న డ్రైనేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించినా నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మురుగు నీరు ప్రధాన రహదారిపైనే పారుతోంది. రోడ్డుపై నడిచే పరిస్థితి నెలకొంది. ఇలా ఉంటే మరో నాలుగు రోజుల్లో నిర్వహించే గణపతి నిమజ్జనం వేడుకలకు భక్తులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



వారోత్సవాల్లో పాల్గొన్న రవీందర్

సుల్తానాబాద్: హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వం జూనియర్ కళాశాల మైదానంలో ధ్యాన్‌చంద్ జయంతి వారోత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ ఖేలో ఇండియా ఖోఖో సెంటర్, స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, ఖేలో ఇండియా ఖోఖో సెంటర్ కోచ్ గెల్లు మధుకర్, జాతీయ సీనియర్ క్రీడాకారులు భైరగోని రవీందర్, ఎల్ల రాజు పాల్గొన్నారు.

ఆలయ ప్రధాన అర్చకుడి ఉద్యోగ విరమణ



సన్మానిస్తున్న ఈవో, ఆలయ కమిటీ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకుడిగా పనిచేసిన కొండపాక లక్ష్మినర్సింహాచార్యులు ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. 40ఏళ్లుగా ఆలయ అర్చకుడిగా ఈ ప్రాంత భక్తులకు సుపరిచితుడైన లక్ష్మినర్సింహాచార్యులు భక్తులకు సేవలందిస్తూ వారి మన్ననలు పొందారని ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య కొనియాడారు. ఈ సందర్భంగా అర్చక దంపతులను ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, నాయకులు సత్కరించారు.

అండర్-12 చెస్ పోటీల్లో రిషిరాజ్ ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న రిషిరాజ్

ఎలిగేడు: గోల్డెన్ యూత్, జీనియస్ చెస్ అకాడమీ కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చదరంగం పోటీల్లో ఎలిగేడుకు చెందిన కేశెట్టి రిషిరాజ్ అండర్-12 విభాగంలో రన్నర్‌గా నిలిచారు. విజేత రిషిరాజ్‌కు కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమొంటో అందజేశారు. డైరెక్టర్ అనూప్‌కుమార్, చెస్ అకాడమీ వ్యవస్థాపకులు జగన్, డా.చందా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో సీసీరోడ్ల నిర్మాణం పూర్తి



ఓదెల: మండలంలోని ఉప్పరపల్లెలో ఊరంతా సీసీరోడ్లు పూర్తయ్యాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక కృషితో రూ.60లక్షల నిధులతో సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. గ్రామంలో 896 ఓటర్లు ఉండగా, 1152 మంది జనాభా ఉంది. ఎనిమిది వార్డులన్నీ సీసీరోడ్ల నిర్మాణం పూర్తవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

50శాతం సీలింగ్ ఎత్తివేయడం హర్షణీయం

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సీలింగ్‌ను ఎత్తివేయడం హర్షణీయమని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మల్యాల సంజీవ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం 2018లోని 285(ఏ) సెక్షన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల రిజర్వేషన్లు కలిపి 50శాతం మించకూడదన్న నిబంధనను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ కీలక నిర్ణయానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హరీశ్, స్వామి, కుమార్, శ్రీనివాస్, అభిలాష్, సాయికుమార్, నరేశ్ ఉన్నారు.

కుంకుమ పూజలు.. అన్నదానం



పెద్దపల్లిరూరల్: అప్పన్నపేటలో పూజలు



జూలపల్లిలో కుంకుమార్చన



జ్యోతినగర్: మట్టి గణపతికి పూజలు



కమాన్‌పూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



సుల్తానాబాద్: 236 రకాల నైవేద్యాలు



ఓదెల: కొలనూర్‌లో అన్నదానం

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/జూలపల్లి/జ్యోతినగర్/ఓదెల/పాలకుర్తి/కమాన్‌పూర్/రామగిరి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లాలోని ఆయా వినాయక మండపాల్లో గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. అనేక మండపాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. పలువురు దాతలు ముందుకు వచ్చి అన్నదానం ఏర్పాటుకు సహకరించడంతో వినాయక మండల సభ్యులు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాలకుర్తి: బసంత్‌నగర్‌లో అన్నదానం



రామగిరి: గోకుల్‌నగర్‌లో అన్నదానం

పంచాయతీ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న రవీందర్

ధర్మారం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ పిలుపునిచ్చారు. ధర్మారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం సీఐటీయూ 4వ మహాసభ గౌరవ అధ్యక్షుడు కూనమల్ల అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ హాజరయ్యారు. ముందుగా ఇటీవల మరణించిన గ్రామ పంచాయతీ కార్మికులకు సంతాపం తెలిపారు.

సీఐటీయూ మండల అధ్యక్షుడిగా గంగాధర్

సీఐటీయూ ధర్మారం మండల అధ్యక్షుడిగా శాతరాజుల గంగాధర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కూనమల్ల అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎదుల్ల రవికుమార్, కోశాధికారిగా గొల్లపెల్లి రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా రాగుల మల్లేశం, కన్న కరుణాకర్, శనిగరపు లచ్చయ్య, సహాయ కార్యదర్శులుగా నెల్లి కుమార్, జూపాక ప్రశాంత్, యశోద కృష్ణతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ పేర్కొన్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

గోదావరిఖని: గణపతి నవరాత్రోత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గోదావరిఖని ఏసీపీ రమేశ్ సూచించారు. ఆదివారం రాత్రి బైక్‌పై తిరుగుతూ గణేశ్ మండపాలను సందర్శించారు. భద్రతా ఏర్పాట్లు, మండప నిర్వాహకులు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి పరిశీలించారు. శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. ఏసీపీ వెంట వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• రైతులకు యూరియా పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో రైతులకు ఆదివారం యూరియా బస్తాలు పంపిణీ చేశారు. మండలానికి 12 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలు రావడంతో మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు టోకెన్లు జారీ చేసి ఎకరానికి ఒక బస్తా చొప్పున అందజేశారు.

• క్విజ్ పోటీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఆదివారం అహిలే సున్నత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీరత్ ఎ ముస్తఫా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఇమాం మౌలానా అజీముద్దీన్ అహ్మద్, ముజాహిద్ రజా, అబ్దుల్ ముఖిత్‌రజా, ఫజీల్‌రజా, సాహిల్ రజా, సైఫ్‌రజా, సల్మాన్, ఉస్మాన్‌అలీ, మహమ్మద్ సాజిద్ పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శంకర్‌గంజ్ ప్రాంతంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవం కోసం తక్కువ ఎత్తు ఉన్న లైన్లు, స్తంభాలను సరిచేసేందుకు మరమ్మతు పనుల దృష్ట్యా తిలక్‌నగర్, జెండాచౌరస్తా, సాగర్‌రోడ్, కుమ్మరివాడ, శంకర్‌గంజ్, పైడబజార్, ఎల్లమ్మగుడి ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

• ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

కమాన్‌పూర్: మండలంలోని గుండారం శివారు రాజేంద్రనగర్‌లో గంజాయి విక్రయించడానికి యత్నిస్తున్న కొండ యశ్వంత్, మాదాసు ఆకాష్‌ను అరెస్టు చేసినట్లు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు తెలిపారు. ఇద్దరి నుంచి 15.820 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా మరో కేసులో పెద్దపల్లికి చెందిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

• ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో కళాజాత ప్రదర్శన

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం కళాకారులు ఆదివారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. వార్డు అధికారులు శ్యామ్, అభినవ్, శానిటరీ జవాన్ సూర్య, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, కళాకారులు పాల్గొన్నారు.

• లాభాల వాటా చెల్లించాలి

రామగిరి: సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా రూ.పదివేలు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు ఉడుత శంకర్ కోరారు. ఆదివారం మంచిర్యాల జిల్లా సేఫ్టీ మీటింగ్‌కు వచ్చిన సీఎండీ బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనాల అమలును దసరాలోపు పెంచాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

నియామకం

సుల్తానాబాద్‌రూరల్: బీసీ యువజన సంఘం మండలం ఉపాధ్యక్షుడిగా మండలంలోని భూపతిపూర్‌కు చెందిన పోచంపల్లి సంపత్‌కుమార్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పిట్టల రమేశ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రం అందించారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని నాగారంలో గ్రామం నుంచి పొలాలకు వెళ్లే దారి మోకాలితోతు బురదగా మారడంతో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం నాట్లు వేసి నిరసన తెలిపారు. అంతకుమందు గ్రామంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల సంపత్‌యాదవ్, కొయ్యడ రవి, నడిగొట్టు సంపత్, ఉప్పరి శ్రీనివాస్, ఇటవేన రవి, ఉపేందర్‌రావు, రాయమల్లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీపై విమర్శలు మానుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడే గుర్తింపు సంఘం ఏఐటీయూసీపై విమర్శలు మానుకోవాలని ఆ యూనియన్ నాయకులు అరెల్లి పోశం, రంగు శ్రీనివాస్ అన్నారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సమస్యల పరిష్కారానికి తమ అగ్రనాయకులు సీతారామయ్య, రాజ్‌కుమార్ కృషి చేస్తున్నారన్నారు. 360 మందికి క్యాడర్ స్కీం ప్రమోషన్లు ఇప్పించామన్నారు. 2024లో 190/240 మస్టర్లు పూర్తి చేసుకున్న వారికి జనరల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్లు ఇప్పించామని పేర్కొన్నారు. నాయకులు ఎస్.వెంకట్‌రెడ్డి, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, నాయిని శంకర్, గొడిశెల నరేశ్, బలుసు రవి, అజీం పాషా, ఉప్పులేటి తిరుపతి, ఎరవెల్లి రాజయ్య, కొప్పుల లింగయ్య, దోరగండ్ల మల్ల య్య, పెద్దెల్లి శంకర్, గోస్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంపు రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలి



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

మంథనిరూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం బ్యాక్ వాటర్‌తో మంథని మండలం ఆరెంద, మల్లారం గ్రామాల్లో జరిగే పంటల ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ మండల అధ్యక్షుడు విరబోయిన రాజేందర్ డిమాండ్ చేశారు. ఆరెంద, మల్లారం గ్రామాల్లో ముంపునకు గురైన పంట భూములను ఆదివారం బాధిత రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌కు అడ్డుగా గత ప్రభుత్వం కరకట్ట నిర్మించిందని, ఈ కరకట్ట మూలంగానే రెండు గ్రామాల్లో సుమారు 380ఎకరాల పంట భూములు ముంపునకు గురవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించడంతో పాటు ముంపురకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు తోట మధూకర్, మండల ప్రధాన కార్యదర్శులు బూడిద రాజు, కొదారి దేవేందర్, ఉపాధ్యక్షులు పత్తి మహేందర్‌రెడ్డి, చిట్యాల స్వరూప, బాధిత రైతులు పాల్గొన్నారు.

భక్తుల కోసం ఆర్టీసీ యాత్ర ప్యాకేజీ క్యాలెండర్ విడుదల

గోదావరిఖనిటౌన్: సెప్టెంబర్‌కు సంబంధించి భక్తుల కోసం గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం ప్రత్యేక యాత్ర ప్యాకేజీల క్యాలెండర్‌ను విడుదల చేశారు. సెప్టెంబర్ 5వ తేదీన సూపర్ లగ్జరీ బస్సు గోదావరిఖని నుంచి ఉదయం 4:30 గంటలకు బయలుదేరుతుంది. యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, కొలనుపాక నుంచి గోదావరిఖనికి చేరుకొనే ఒకరోజు యాత్రకు పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.800గా నిర్ణయించారు. 7న కాణిపాకం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, విష్ణు కంచి, శివకంచి, ఆలంపూర్ జోగులాంబ దర్శనాలు నాలుగు రోజుల యాత్ర ఉంటుందన్నారు. ఈ యాత్రకు పెద్దలకు రూ.5600, పిల్లలకు రూ.4400గా ఉంటుందన్నారు. అలాగే 11న ఝరాసంగం, బీదర్, రేజింతల్ ఒకరోజు యాత్రకు పెద్దలకు రూ.1600, పిల్లలకు రూ.1250 ఉంటుందని వివరించారు. 14న అన్నవరం, సింహాచలం, ఆర్కే బీచ్, పిఠాపురం, ద్రాక్షారామం, విజయవాడ దర్శనం మూడురోజుల యాత్ర ఉంటుందని, పెద్దలకు రూ.3500, పిల్లలకు రూ.2800 ఉంటుందన్నారు. 17వ తేదీన శ్రీశైలం, యాగంటి, అహోబిలం, మహానంది దర్శనం 3రోజుల యాత్ర ఉంటుందని, పెద్దలకు రూ.3500, పిల్లలకు రూ.2800 ఉంటుందని వెల్లడించారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అడవిశ్రీరాంపూర్ వాసులకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న జావీద్ పాషా

మంథని: ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు డాక్టరేట్ అందుకున్నారు. గ్రామానికి చెందిన సయ్యద్ జావిద్ పాషా, మాడిశెట్టి మహేశ్ సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లో నాంపల్లిలో సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీలో ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్, రిసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఫౌండర్, చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేశ్, వందే భారత్ సేవ్ ఇండియా మూవీ డైరెక్టర్ డాక్టర్ మల్లం రమేశ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు జావీద్ తెలిపారు.

'మంత్రిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు'

రామగిరి: నిత్యం రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కోసం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేసిన ఆందోళన ఓ కపట నాటకమన్నారు. ఇప్పటికైనా చౌకబారు విమర్శలు మానుకోవాలన్నారు. నాయకులు తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు, కల్వల శంకర్, చిందం మహేశ్, కాటం సత్యం, పుల్లెల కొముర య్య, సందెల కుమార్, మట్ట రాజ్‌కుమార్, బొగె ప్రకాశ్, కెక్కర్ల స్వరూప, కలవేన శ్రీకాంత్, వీణ శ్రీధర్ పాల్గొన్నారు.